ఆర్థిక సంక్షోభంపై భేటీ

మున్ముందు మరిన్ని సమావేశాలు – తొలి సమావేశానికి అమెరికా ఆతిథ్యం

వాషింగ్టన్ : ప్రపంచంలో 1930లో ఏర్పడిన మహామాంద్యం నాటి నుంచి ఎన్నడూ లేనంత పెద్ద ఆర్థిక ఇబ్బంది ప్రపంచాన్ని చుట్టుముట్టడంతో ఇప్పుడు తీవ్ర సంక్షోభం నెలకొంది. ఈ నేపథ్యంలో దీనిపై చర్చించేందుకు శిఖరాగ్ర సమావేశాలు నిర్వహించాలని ప్రపంచ నేతలు నిర్ణయించారు. వీటిలో మొదటి దానికి తాను ఆతిథ్యం ఇస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు జార్జి డబ్ల్యు బుష్ శనివారం ప్రకటించారు. 'మనమంతా ఈ సంక్షోభాన్ని ఉమ్మడిగా ఎదుర్కొంటున్నందున అందరం కలిసి పని చేయడం అవసరం' అని అన్నారు. క్యాంప్ డేవిడ్‌లోని అధ్యక్ష అతిథి గృహంలో ఫ్రెంచి అధ్యక్షుడు నికొలస్ సర్కోజీ, ఐరోపా కమిషన్ అధ్యక్షుడు జోస్ మాన్యుయెల్ బర్రోసోతో ఆయన సమావేశమయ్యారు. నవంబర్ 4న అధ్యక్ష ఎన్నికలు ముగిసిన అనంతరం వెంటనే తొలి శిఖరాగ్ర సభ జరుగుతుందని సమావేశానంతరం విడుదల చేసిన ఉమ్మడి ప్రకటనలో తెలిపారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను స్థిరీకరించేందుకు అవసరమైన 'సంస్కరణల సూత్రాలపై' ఆ సమావేశాల్లో దృష్టి సారిస్తామని అన్నారు. 'ఆ సూత్రాలను అమలు చేసేందుకు అవసరమైన ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. ఇందుకోసం ఒప్పందాన్ని చేసుకుంటాం. దాని అమలు దిశగా తదుపరి శిఖరాగ్ర సభలను రూపకల్పన చేస్తాం' అని ఆ ప్రకటన వివరించింది. వచ్చే వారం నుంచి ప్రపంచంలోని ఇతర నేతలను కూడా సంప్రదించడం ప్రారంభిస్తామని వారు తెలిపారు. ఒకే శిఖరాగ్ర సభలో అన్ని సమస్యలూ చర్చించడం చాలా కష్టమని అమెరికా, ఐరోపా నేతలు అభిప్రాయపడినట్లు వైట్‌హౌస్ ప్రతినిధి టోనీ ఫ్రట్టో చెప్పారు. రెండవ ప్రపంచ యుద్ధానంతరం 1944లో బ్రెట్టన్ ఉడ్స్ సదస్సు తర్వాత ఏర్పాటు చేసిన అంతర్జాతీయ ఆర్థిక విధానాన్ని పునర్వ్యవస్థీకరించాల్సిందిగా సర్కోజీ పిలుపునిచ్చారు. పూర్తి స్థాయిలో ప్రపంచ మాంద్యం వస్తుందనే ఆందోళన నేపథ్యంలో ఈ శిఖరాగ్ర సభ ప్రణాళిక రూపొందింది. అమెరికా వినియోగదారులలో విశ్వాసం సన్నగిల్లుతోంది. నూతన గృహాల నిర్మాణంలో తగ్గుదల కన్పిస్తోంది. ఇన్వెస్టర్లు తమ నష్టాలను లెక్కించుకుంటూ ఈ ఆర్థిక సంక్షోభం ఎప్పుడు ఓ కొలిక్కి వస్తుందా అని ఎదురు చూస్తుండటంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న స్టాక్ మార్కెట్లు అస్థిరంగా ఉన్నాయి. అయినా ఐరోపాలో షేర్ల విలువ బాగానే ఉంది. గత జులై నుంచి మొట్టమొదటిసారిగా ఈ వారంలో అంతర్–బ్యాంకింగ్ రుణాల రేట్లు తగ్గడం మరో ఆశాకిరణంగా ఉండటంతో ప్రపంచవ్యాప్తంగా ఏర్పడిన రుణ సంక్షోభం కొంత కుదుటపడవచ్చని భావిస్తున్నారు. అయితే మొత్తం మీద పరిస్థితి నిరాశాజనకంగానే ఉంది. సంక్షోభం బారిన పడిన దేశాలకు సహాయం చేసేందుకు ఆర్థిక సంస్థలు పూనుకున్నాయి. ఆర్థిక వ్యవస్థను సుస్థిరపరచుకునేందుకు అంతర్జాతీయ ద్రవ్యనిధి నుంచి తాను 1,400 కోట్ల డాలర్ల రుణం పొందవచ్చని ఉక్రెయిన్ తెలిపింది.

బుష్‌తో ఫ్రెంచి అధ్యక్షుడు నికొలస్ సర్కోజీ, ఐరోపా కమిషన్ అధ్యక్షుడు జోస్ మాన్యుయెల్ బర్రోసో

ఒక అవకాశం

ఈ శిఖరాగ్రసభ మొత్తంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థను పునఃపరిశీలించే అవకాశం కల్పిస్తుందని ప్రస్తుతం ఐరోపా యూనియన్ అధ్యక్ష పదవిలో ఉన్న ఫ్రాన్స్ అధ్యక్షుడు సర్కోజీ చెప్పారు. 'మార్కెట్ ఆర్థిక సూత్రాల పునాదులను సవాలు చేయడం తప్పు అవుతుంది. అయితే మనం అవే సూత్రాలపై కొనసాగజాలం' అని ఆయన అన్నారు. నియంత్రిత పెట్టుబడిదారీ నూతన రూపాన్ని ఆయన ప్రతిపాదించారు. యూరో, అమెరికా డాలర్ వంటి ప్రధాన ప్రపంచ కరెన్సీల మధ్య సంబంధాలను సమీక్షించడం ఒక చర్య అని ఆయన గత వారంలో సూచించారు. బ్రిటీష్ ప్రధాని గోర్డన్ బ్రౌన్ కూడా కొన్ని సంస్కరణలు ప్రతిపాదించారు. ఆర్థిక వ్యవస్థలోని ప్రమాదాలను పరిశీలించేందుకు నియంత్రణ వేదిక ఏర్పాటు, కఠినతరమైన కొత్త షరతులు, ఎగ్జిక్యూటివ్ వేతనాలకు సంబంధించి నియమనిబంధనలు విధించడం వంటి కొన్ని సూచనలు చేశారు. బుష్ వచ్చే జనవరిలో పదవి నుంచి వైదొలుగుతారు. ప్రజాతంత్ర పెట్టుబడిదారీ విధాన ప్రాథమిక సూత్రాలైన స్వేచ్ఛా మార్కెట్లు, స్వేచ్ఛా వాణిజ్యం, స్వేచ్ఛా పరిశ్రమ అనే వాటిని గౌరవించాలని బుష్ గత శనివారం నొక్కి చెప్పారు. ఈ శిఖరాగ్ర సభలో అభివృద్ధి చెందిన దేశాలు, వర్ధమాన దేశాలు రెండూ ప్రాతినిధ్యం వహిస్తాయని ఆయన చెప్పారు. 'ఈ సమావేశం విజయవంతం కావాలంటే మనకు ప్రపంచవ్యాప్తంగా అభిప్రాయాలు రావాలి' అని బుష్ తెలిపారు.

కుప్పకూలుతున్న ఆర్థిక వ్యవస్థలు

రుణ సంక్షోభం ప్రపంచవ్యాప్తంగా దేశాలను పీల్చిపిప్పి చేస్తున్న తరుణంలో ఈ శిఖరాగ్ర సభను ప్రకటించారు. ఐస్లాండ్‌కు రుణం ఇవ్వాలా అనే విషయంలో తాను ఇంకా నిర్ణయం తీసుకోలేదని రష్యా వెల్లడించడంతో ఈ ఆర్థిక సంక్షోభంతో కుప్పకూలడానికి సిద్ధంగా ఉన్న ఆ దేశం మరింత అనిశ్చితిలో పడింది. ఆగస్టు నుంచి సెప్టెంబర్ వరకూ 3,300 కోట్ల డాలర్ల పెట్టుబడులు బయటికెళ్ళాయని రష్యా ఆర్థిక మంత్రి అలెక్సీ కుద్రిన్ చెప్పారు. అమెరికా వినియోగదారుల విశ్వాసం అక్టోబర్‌లో 1952లో సర్వేను ప్రారంభించిన నాటి నుంచి ఎన్నడూ లేనంత తక్కువ స్థాయికి పడిపోయిందని రాయిటర్స్/మిచిగాన్ విశ్వవిద్యాలయం సర్వే తెలిపింది. 1991 జనవరి నాటి నుంచి ఎన్నడూ లేనంత తక్కువ స్థాయిలో నూతన గృహాల నిర్మాణం జరుగుతోంది. 'విశ్వాసం కుప్పకూలిపోతోంది. అందువల్ల గ్యాస్ ధరలు తగ్గుతున్నప్పటికీ అది మంచిదేమీ కాదు' అని న్యూయార్క్‌లోని స్టాండర్డ్ ఛార్టర్డ్ ముఖ్య ఆర్థికవేత్త డౌగ్ స్మిత్ తెలిపారు.

చమురుకు 80-90 డాలర్లుంటేే చాలు : ఛావెజ్



కారకాస్ : వెనిజులాకు చమురు ధరలు 80 నుంచి 90 డాలర్ల మధ్య ఉంటే చాలని దేశాధ్యక్షుడు హ్యూగో ఛావెజ్ చెప్పారు. చమురు ధరలు పడిపోతున్న నేపథ్యంలో సరఫరాలు తగ్గించేందుకు అంగీకరించడానికి ఒపెక్ అత్యవసర సమావేశం జరగడానికి కొద్ది రోజుల ముందే ఆయన ప్రకటన వెలువడింది. ఒపెక్ ఎటువంటి ధరా ప్రకటించకుండా తప్పించుకుంది. ప్రపంచ ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో చమురు ధరలు తగ్గిపోయాయి. దీంతో ప్రపంచవ్యాప్తంగా మాంద్యం ఏర్పడి చమురుకు డిమాండ్ తగ్గే అవకాశముందనే ఆందోళనలు తలెత్తాయి. చమురు ధరలు జులైలో బ్యారల్‌కు 150 డాలర్ల వరకూ పెరిగాయి. అయితే ఈ వారంలో ధరలు దానిలో సగానికి తక్కువకు పడిపోయాయి. ధరలు తగ్గడం వల్ల ఆదాయం తగ్గిపోతుందని, అందువల్ల పేదలకు ఆహార సబ్సిడీ వంటి తన సోషలిస్టు కార్యక్రమాలను ఇబ్బంది కలుగుతుందనే భయాలను ఛావెజ్ తోసిపుచ్చారు. 'చమురు ధర 80 నుంచి 90 డాలర్ల మధ్య నిలకడగా ఉంటే అదే సరిపోతుంది' అని ఆయన చెప్పారు. 'ప్రపంచ ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో దేశం వెనక్కు వెళ్ళే ప్రమాదమేమీ లేదని నేను వెనిజులా ప్రజలకు గ్యారంటీ ఇస్తున్నాను. ఆర్థిక వృద్ధితో ముందుకు సాగేందుకు వెనిజులాకు తగినన్ని సామాజిక, ఆర్థిక, సాంకేతిక వనరులున్నాయి' అని హామీ ఇచ్చారు. వెనిజులాకు చమురు ధరలు కీలకం కాదని, ఎందుకంటే దానికి పెద్ద ఎత్తున ఆదాయాలు, విదేశీ రుణాలు ఉన్నాయని ఛావెజ్ చెప్పారు. ఈ నెల 24న జరిగే ఒపెక్ సమావేశంలో సరఫరాలు తగ్గించే అవకాశముందని ఆ గ్రూపు మాజీ అధ్యక్షుడు, వెనిజులా ఆర్థిక మంత్రి అలీ రోడ్రిగ్వెజ్ చెప్పారు. కోత రోజుకు కనీసం పది లక్షల బ్యారళ్ళు ఉండవచ్చని ఒపెక్ ప్రస్తుత అధ్యక్షుడు చెప్పారు.

మాలికీతో హట్టన్ భేటీ

ఇరాక్‌లో బ్రిటన్ రక్షణ మంత్రి

బాగ్దాద్ : బ్రిటన్ కొత్త రక్షణ మంత్రి జాన్ హట్టన్ తొలిసారిగా ఇరాక్‌లో పర్యటించారు. ఈ పర్యటనలో ఆయన ఇరాక్ ప్రధాని నూరీ అల్ మాలికీతో బాగ్దాద్‌లో భేటీ అయ్యారు. మాజీ వాణిజ్య మంత్రి అయిన హట్టన్ ఈ నెల 3న జరిగిన ప్రధాని గోర్డన్ బ్రౌన్ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో రక్షణ శాఖను చేపట్టారు. ఇరాక్‌లో నాలుగు వేల మందికి పైగా బ్రిటీష్ సైనికులున్నారు. వారు కూడా దక్షిణ ప్రాంత నగరమైన బస్రా వెలుపల ఉన్న వైమానిక స్థావరంలో ఉన్నారు. ఈ సంవత్సరాంతంలో ఐరాస భద్రతా మండలి గడువు ముగిసిన అనంతరం కూడా తన దళాలు అక్కడ ఉండేందుకు అనుమతించాలంటూ అమెరికా మాదిరిగా బ్రిటన్ కూడా ఇరాక్‌తో చర్చలు జరుపుతోంది.

నేడు ఛత్తీస్‌ఘర్ తొలి దశ పోలింగ్ నోటిఫికేషన్

రాయ్‌పూర్ : ఛత్తీస్‌ఘర్ అసెంబ్లీలోని 39 స్థానాలకు జరిగే తొలి దశ పోలింగ్‌కు సంబంధించిన నోటిఫికేషన్‌ను సోమవారం విడుదల చేస్తారు. తొలిదశ పోలింగ్ నవంబరు 14న జరుగుతుంది. ఆదివారం రాష్ట్ర డిప్యూటీ ఎన్నికల అధికారి ఆర్‌డి దివాన్ మీడియాతో మాట్లాడుతూ నాలుగు జిల్లాల పరిధిలో ఉన్న 39 స్థానాలకు తొలి దశలో పోలింగ్ జరుగుతుందని చెప్పారు. అక్టోబరు 27 వరకు నామినేషన్లను స్వీకరిస్తామని, 29న పరిశీలన జరుపుతామని, నామినేషన్ల ఉపసంహరణకు అక్టోబరు 31 చివరి తేదీ అని వివరించారు. ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించాలనే యోచనతోనే మొదటిసారిగా పోలింగ్‌ను రెండు దశలలో జరుపుతున్నట్లు ఆయన చెప్పారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలలో ఎన్నికలు స్వేచ్ఛగా జరిగేందుకు అదనపు బలగాలను వినియోగిస్తామని తెలిపారు.

ప్రణబ్‌కు శ్రీలంక ఆహ్వానం

న్యూఢిల్లీ : శ్రీలంక సైన్యం, తమిళనాడు ప్రజల మధ్య నెలకొన్న తాజా పరిణామాలపై చర్చలు జరిపేందుకు ఆదేశ విదేశాంగమంత్రి రోహితా బొగొల్లాగేమ్ భారత విదేశాంగ మంత్రి ప్రణబ్ ముఖర్జీని ఆహ్వానించారు. పటిష్టమైన ద్వైపాక్షిక సంబంధాలను ఇక ముందు కూడా కొనసాగించేందకు ఉన్నతస్థాయిలో చర్చలు జరపాలని ఇరు దేశాలు నిర్ణయించినట్లు శ్రీలంక విదేశాంగ మంత్రిత్వ శాఖ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. తాజా పరిణామాలను అధ్యయనం చేసేందుకు శ్రీలంక అధ్యక్షులు న్యూఢిల్లీకి ఇప్పటికే ప్రత్యేక రాయబారిని పంపారు.

21న మానవ హారం

చెన్నయ్ : శ్రీలంకలో వేధింపులకు గురవుతున్న తమిళులపై కేంద్రం మీద ఒత్తిడి తెచ్చేందుకు ఈనెల 21న మానవ హారంగా ఏర్పడి ఆందోళన తెలియజేయనున్నట్లు డిఎంకె అధ్యక్షుడు, తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కరుణానిధి తెలిపారు. పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ఆదివారం మాట్లాడుతూ మానవ హారంగా ఏర్పడి ఆందోళన చేసినంత మాత్రాన ఒరిగేదేమీ లేదని ఎఐఎడిఎంకె అధ్యక్షురాలు జె.జయలలిత వ్యాఖ్యానించారని, కానీ తమిళుల సమస్య పరిష్కారం లక్ష్యంగా దీనిని నిర్వహిస్తున్నామని చెప్పారు. శ్రీలంక అభివృద్ధికి తమరక్తం ధారపోసిన తమిళులు ప్రస్తుతం అదే నేల మీద ఊచకోతకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఊచకోతలకు తమిళుల స్పందనను మానవహారం ద్వారా ప్రపంచ దృష్టికి తేనున్నామని కరుణానిధి చెప్పారు. ఈ విషయంలో సినీనటుడు విజయకాంత్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు.

కెసిఆర్‌కు తలుపులు తెరిచే ఉన్నాయి : విహెచ్

(ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో)

ప్రత్యేక తెలంగాణా విషయంలో తమ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ స్పష్టమైన వైఖరితో ఉన్నారని రాజ్యసభ సభ్యులు వి.హన్మంతరావు వ్యాఖ్యానించారు. ఆదివారం ఆయన స్థానికంగా మీడియాతో మాట్లాడారు. తమ ప్రభుత్వానికి టిఆర్ఎస్ మద్దతు ఉపసంహరించిన తర్వాత కూడా తెలంగాణా కోసం ఏర్పాటైన ప్రణబ్ ముఖర్జీ కమిటీని సోనియా గాంధీ రద్దు చేయలేదని చెప్పారు. తెలంగాణాపై తమ వైఖరి ఎప్పటికీ మారబోదని, తాము తెలంగాణాకు అనుకూలంగా ఉన్నామని చెప్పారు. ఈ విషయాన్ని సోనియాకు వివరించామని, ఆమె తెలంగాణాకు సానుకూలంగానే నిర్ణయం తీసుకుంటారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణా విషయంలో టిఆర్ఎస్ అధినేత కెసిఆర్‌తో మాట్లాడటంలో తప్పులేదని, కెసిఆర్‌కు తమ పార్టీ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని విహెచ్ చెప్పారు. కెసిఆర్‌తో తమ పార్టీ అధ్యక్షులు డి.శ్రీనివాస్ మాట్లాడతారనే అభిప్రాయాన్ని విహెచ్ వ్యక్తం చేశారు.

బిజెపి పాలన కోసం ప్రజల ఎదురుచూపు : వెంకయ్య

(ప్రజాశక్తి –హైదరాబాద్ బ్యూరో)

దేశ ప్రజలు బిజెపి పాలన కోసం ఎదురు చూస్తున్నారని బిజెపి సీనియర్ నాయకులు ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. హైదరాబాద్‌లో ఆదివారం ప్రారంభమైన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సమావేశాల సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్ల కోసం కుహన లౌకికవాద పార్టీలు రాజకీయం చేస్తున్నాయని విమర్శించారు. మజ్లిస్ పార్టీ ముస్లింలకు గుత్తేదారా? అని ప్రశ్నించారు. ఎన్నికల్లో లబ్ది పొందేందుకు ఆ పార్టీ మతాన్ని రెచ్చగొడుతోందని విమర్శించారు. ముస్లిం ప్రజలు శాంతినే కోరుకుంటున్నారని, క్రైస్తవ మైనార్టీలను వారు వ్యతిరేకించటం లేదని చెప్పారు. తీవ్రవాదానికి ఎలాంటి మతం ఉండబోదని, కానీ తీవ్రవాద సిద్ధాంతకర్తలు మతాన్ని వాడుకుంటున్నారని అన్నారు. కాశ్మీర్‌లో పాకిస్తాన్ జెండాలు రెపరెపలాడుతున్నప్పటికీ ప్రధాని, హోంమంత్రి నోరు మెదపటం లేదని విమర్శించారు. షేర్ మార్కెట్ పడిపోవటం, రియల్ ఎస్టేట్ అదుపు తప్పటం, తీవ్రవాదం, అంతర్గత భద్రతా వైఫల్యం, అధిక ధరల్లాంటి సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండారు దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్న జవాబులు

1. సాల్మన్ రష్దీ 2. పాకిస్తాన్
3. టోక్యో 4. ఎయిడ్స్
5. డెమోగ్రఫీ

చైనాలో అత్యుత్తమ వేతనాలు

భారత్‌లో వ్యత్యాసాలెక్కువే : ఐఎల్‌ఒ

న్యూఢిల్లీ : గత రెండు దశాబ్దాల కాలంలో ఉత్పాదకత ఐదు శాతం పెరిగినా ఉద్యోగుల వేతనాలు మాత్రం గొర్రెతోక బెత్తెడేనన్న చందాన కేవలం ఒక్క శాతం మాత్రమే పెరుగుదల నమోదు చేసుకున్నాయని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఒ) తేల్చి చెప్పింది. ఈ సంస్థ ఇటీవల 32 దేశాల్లో నిర్వహించిన అధ్యయనంలో 1990, 2007 మధ్య కాలంలో ఉత్పాదకత, వేతనాల మధ్య వ్యత్యాసం భారత్‌లోనే గరిష్టస్థాయిలో 9 శాతం నమోదయిందని తెలిపింది. చైనా తన ఉద్యోగులకు అత్యుత్తమ స్థాయిలో వేతనాలను అందచేస్తోందని ఈ సర్వే వెల్లడించింది. ఇక్కడ ఉత్పాదకత, వేతన నిష్పత్తి 9:10 ఉందని, బ్రెజిల్‌లో ఈ నిష్పత్తి 3.5:- 3.5గా ఉందని తెలిపింది. 'ప్రపంచ ఉపాధి నివేదిక–2008' పేరిట వెలువరించిన ఈ నివేదికలో ఆర్థిక ప్రపంచీకరణ నేపథ్యంలో ఆదాయాల అసమానతలను ఐఎల్‌ఒకు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఫర్ లేబర్ స్టడీస్ సంస్థ ఎత్తి చూపింది. భారత్‌లో ఆర్థిక వ్యవస్థ సరళీకరణ, ప్రపంచీకరణ ఊపందుకున్న 1990 నాటి నుంచి ధనిక, పేద తారతమ్యం తారాస్థాయిలో పెరిగిపోయిందని ఈ నివేదిక వెల్లడించింది. ఇటీవలి అభివృద్ధి ఫలాలను అందుకోలేని కోట్లాది మంది ప్రజలు ప్రస్తుత ఆర్థిక సంక్షోభం భారాన్ని మోస్తున్నారని ఈ నివేదిక రూపొందించిన సంస్థ డైరెక్టర్ రేమాండ్ టోరిస్ చెప్పారు. వేతన వ్యత్యాసాల జాబితాలో భారత్ మూడో స్థానంలో ఉండగా బెల్జియం అట్టడుగు స్థానంలో ఉంది. భారత్‌లో ఆహారోత్పత్తుల ధరలు 9 శాతానికి పైగా పెరగ్గా, ఆహారేతర ఉత్పత్తుల ధరలు కేవలం 6.3 శాతం మాత్రమే పెరిగాయని తెలిపింది. ఆదాయ అసమానతలకు ఈ ధరల పెరుగుదల కూడా దోహదపడుతోందని పేర్కొంది. ఈ పెరుగుదల పట్టణ ప్రాంతాల కుటుంబాల కొనుగోలుశక్తిపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతోందని తెలిపింది. ఆహార ధరల పెరుగుదల కారణంగా పట్టణవాసుల కొనుగోలుశక్తి 5.1 శాతం నుంచి 3.5 శాతానికి పడిపోయిందని తెలిపింది. ఇందులో ఎక్కువగా మధ్య, దిగువ మధ్య తరగతి వారే ఎక్కువగా ఉన్నారని పేర్కొంది. ఇక పేదల కొనుగోలుశక్తి దాదాపు ఐదు శాతానికి పైగా క్షీణించిందని తెలిపింది. ధనికుల కొనుగోలు శక్తి గత ఏడాది కేవలం 2.2 శాతం మాత్రమే తగ్గుదల నమోదు చేసుకుంది. ఆదాయాల అసమానతలకు మరో కారణం దేశంలో తాత్కాలిక ఉద్యోగుల సంఖ్య గణనీయంగా పెరగటమే. ప్రపంచీకరణ, సరళీకరణ విధానాల నేపథ్యంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు శాశ్వత నియామకాలకు తిలోదకాలిచ్చి తాత్కాలిక నియామకాలపైనే మొగ్గుచూపుతున్న విషయం తెలిసిందే. ఈ పరిస్థితి భారత్‌లో కంటే లాటిన్ అమెరికా దేశాల్లోనే కొంత ఆశాజనకంగా ఉందని వివరించింది.

చట్టానికి పదును.. ఇంటెలిజెన్స్ బలోపేతం

ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వ యోచన

న్యూఢిల్లీ : దేశంలో విస్తరిస్తున్న ఉగ్రవాద సంస్థల నెట్‌వర్క్‌పై ఆందోళన వ్యక్తం చేస్తున్న కేంద్రం వీటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడంతో పాటు చట్టాలకు మరింత పదును పెట్టాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి 1967 నాటి చట్టవ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టాన్ని సవరించి ఉగ్రవాదానికి విస్తృత స్థాయిలో నిర్వచనం ఇవ్వాలని కేంద్ర హోంశాఖ నిర్ణయించింది. తద్వారా ఇది ఉగ్రవాద ఘటనలను దర్యాప్తు చేస్తున్న సంస్థలకు ఆధారాలు సేకరించేందుకు సహాయకారి అవుతుందని అభిప్రాయపడింది. అయితే ఈ చట్టాలకు పదును పెట్టినంత మాత్రాన సామాన్య ప్రజలను వేధిస్తారన్న అభిప్రాయం సరికాదని ప్రభుత్వ వర్గాలు తేల్చి చెప్పాయి. వీరప్ప మొయిలీ నేతృత్వంలోని పాలనా సంస్కరణల కమిటీ, బిజెపి, తదితర ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నట్టుగా ఉగ్రవాద నిరోధానికి ప్రత్యేక చట్టం తేవాలన్న ఆలోచన ప్రభుత్వానికి లేదని ఈ వర్గాలు స్పష్టం చేశాయి. కేంద్ర ఇంటెలిజెన్స్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఇంటెలిజెన్స్ బ్యూరోలో కొత్త పోస్టులను ఏర్పాటు చేశామని, ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి కూడా ప్రభుత్వం అనుమతించిందని ఆ వర్గాలు వివరించాయి. అదే విధంగా సమాచార సేకరణ, విశ్లేషణ, మార్పిడి, రాష్ట్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలతో సమన్వయం వంటి అంశాలను క్రమబద్ధీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించాయి. ఇంటెలిజెన్స్ వ్యవస్థను పటిష్టం చేసేందుకు ఉన్నతాధికారుల కమిటీని హోంశాఖ నియమించింది. ఈ కమిటీలో ఆంధ్రప్రదేశ్, కర్నాటక, యుపి, అసోం, ఢిల్లీ రాష్ట్రాల డిజిపిలు సభ్యులుగా ఉన్నారు. ఇదిలా ఉండగా సిమి, తదితర సంస్థలపై నిషేధాన్ని కొనసాగించాలని కేంద్రం నిర్ణయించింది. ఎల్‌టిటిఇ, హిజ్బుల్ ముజాహిదీన్, లష్కరే తోయిబా వంటి 32 సంస్థలను కేంద్రం ఉగ్రవాద సంస్థలుగా ప్రకటించిన విషయం తెలిసిందే.

అవినీతికి పాల్పడ్డ చైనా అధికారికి మరణశిక్ష

బీజింగ్ : బీజింగ్ మాజీ ఉప మేయర్, ఒలింపిక్స్ నిర్మాణ ప్రాజెక్టు ఇన్‌ఛార్జి అవినీతికి పాల్పడ్డారంటూ స్థానిక కోర్టు ఆయనకు మరణశిక్ష విధించింది. లియు జింహువా లంచం తీసుకున్నట్లు నిర్ధారిస్తూ బీజింగ్ వెలుపలున్న హెంగ్‌సూయిలోని ప్రజాకోర్టు శనివారంనాడు ఆయనకు మరణశిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. అయితే శిక్ష అమలును రెండు సంవత్సరాల పాటు నిలిపివేస్తున్నట్లు కోర్టు గుమస్తా తెలిపారు. ఈ సమయంలో లియు సత్ప్రవర్తన కలిగి ఉంటే మరణశిక్షను యావజ్జీవ కారాగారంగా మారుస్తారు. ప్రపంచ సమాజంలో తన ప్రతిష్ట దిగజారకుండా ఉండేందుకు లియుపై విచారణ నివేదికలను ప్రభుత్వం గోప్యంగా ఉంచింది. లియు దుశ్చర్యతో ఒలింపిక్ ప్రాజెక్టుకు ఎటువంటి సంబంధమూ లేకపోయినప్పటికీ ఒలింపిక్స్ సన్నాహాలపై మాత్రం కొంత ప్రభావం చూపింది.

300 మంది ఉద్యోగులకు టాటా మోటార్స్ ఉద్వాసన

జంషెడ్‌పూర్ : రోజురోజుకూ తీవ్రమవుతున్న ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా అనేక సంస్థలు తమ ఉద్యోగులను ఇంటికి సాగనంపుతున్నాయి. తాజాగా టాటా మోటార్స్ యాజమాన్యం ఆ కార్యక్రమాన్ని చేపట్టింది. దేశంలోనే అత్యంత పెద్దదైన ఆటోమొబైల్ ఉత్పత్తిదారు టాటా మోటార్స్ జంషెడ్‌పూర్‌లోని తమ కర్మాగారంలో పని చేసే 300 మంది తాత్కాలిక ఉద్యోగులకు ఉద్వాసన పలుకుతూ తాజాగా నోటీసులు జారీ చేసింది. ఈ విషయాన్ని టెల్కో ఉద్యోగుల సంఘ ప్రధాన కార్యదర్శి చంద్రభాను ప్రసాద్ ధృవీకరించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉత్పత్తి మాంద్యం దృష్ట్యా సోమవారం నుంచి ఉద్యోగులను కుదిస్తున్నట్లు కంపెనీ యాజమాన్యం తమకు తెలియజేసిందని అన్నారు. ఉత్పత్తి పడిపోయిందన్న సాకుతో వర్షాకాలంలో 1500 మంది ఉద్యో గులను ఇంటికి పంపారు. ఇప్పుడు మళ్ళీ అదే సాకుతో మరో మూడొందల మందిని కంపెనీ సాగనంపుతోందని చంద్రభాను విమర్శించారు. ఉద్యోగుల సంక్షేమం దృష్ట్యా ప్రస్తుతానికి ఈ చర్యలను ప్రతిఘటించడం లేదని అన్నారు. ఉత్పత్తి మాంద్యం తొలగిపోతే తొలగించిన ఉద్యోగులను అందరినీ తిరిగి పనిలోకి తీసుకుంటారని చెప్పారు. కాగా ఉద్యోగుల తొల గింపు ఏటా జరిగే సాధారణ ప్రక్రి యేనని టాటా మోటార్స్ అధికార ప్రతినిధి కెప్టెన్ పిజె సింగ్ వ్యాఖ్యానించారు.



ఘనంగా విష్ణు నిశ్చితార్థం

(ప్రజాశక్తి విలేకరి–గచ్చిబౌలి)

ముఖ్యమంత్రి సోదరుడు సుధీర్‌రెడ్డి, విద్య దంపతుల కుమార్తె విరానికకు, ప్రముఖ నటులు మోహన్‌బాబు కుమారుడు మంచు విష్ణువర్ధన్‌తో ఆదివారం రాత్రి 8 గంటలకు నిశ్చితార్థాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి దంపతులు, ప్రతిపక్ష నేత చంద్రబాబు, పిఆర్‌పి అధినేత చిరంజీవి, డిసిసి అధ్యక్షుడు డి శ్రీనివాస్, రాష్ట్రమంత్రులు జానారెడ్డి, రోశయ్య, రాజ్యలక్ష్మి, పొన్నాల లక్ష్మయ్య, బొత్స సత్యనారాయణ, సబితాఇంద్రారెడ్డి, కోనేరు రంగారావు, మధుయాష్కిగౌడ్, మండలి బుద్ధప్రసాద్, కొణతాల రామకృష్ణ పాల్గొన్నారు. పలువురు టిడిపి, బిజెపి నాయకులు, సినీ పరిశ్రమకు చెందిన రామానాయుడు, బాలకృష్ణ, కృష్ణంరాజు, రాఘవేంద్రరావు, ముత్యాల సుబ్బయ్య, పరుచూరి వెంకటేశ్వరరావు, జూనియర్ ఎన్‌టిఆర్, వెంకటేశ్, రవితేజ, ప్రభాస్, తరుణ్, ఎమ్మెస్ నారాయణ, ఆలీ, పూరిజగన్నాథ్, తదితర సినీ ప్రముఖులు హాజరయ్యారు.

భారత్‌లో కామన్వెల్త్ సెక్రటరీ జనరల్

న్యూఢిల్లీ : కామన్వెల్త్ సెక్రటరీ జనరల్ కమలేష్ శర్మ భారత్‌లో తొలి అధికారిక పర్యటన జరుపుతున్నారు. ఈనెల 22వ తేదీ వరకు ఆయన భారత్‌లో పర్యటిస్తారు. ఈ సందర్భంగా ప్రధాని మన్మోహన్ సింగ్‌తో సహా పలువురు సీనియర్ నేతలతో వివిధ అంశాలపై సంప్రదింపులు జరుపుతారు. సోమవారం ఉదయం ప్రధాని మన్మోహన్ సింగ్‌ను పార్లమెంట్‌లో కలుసుకుంటారు. ఆ తరువాత భారత పరిశ్రమల సమాఖ్య (సిఐఐ) నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారు. కామన్వెల్త్ దేశాలలో వర్తక నైపుణ్యాలను అభివృద్ధి చేయడమెలా అనే అంశంపై ఈ సమావేశంలో ఆయన పలువురితో చర్చిస్తారు. ఢిల్లీలో రెండు రోజులు విడిది చేసే ఆయన విదేశీ వ్యవహారాల మంత్రి ప్రణబ్ ముఖర్జీ, ఆర్థిక మంత్రి పి.చిదంబరం, యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ సహాయ మంత్రి ఎంఎస్.గిల్‌తో చర్చలు జరుపుతారు. ఉపరాష్ట్రపతి మహమ్మద్ హమీద్ అన్సారీ, లోక్‌సభ స్పీకర్ సోమనాథ్ ఛటర్జీ, ప్రతిపక్ష నేత ఎల్‌కె.అద్వానీలను మర్యాద పూర్వకంగా కలుసుకుంటారు. ఈ సందర్భంగా ఆయన కామన్వెల్త్ సాధించిన ప్రగతిని గురించి నాయకులకు వివరిస్తారు.

రైల్వేబోర్డు పరీక్షకు హాజరైన ఉత్తరాది వారిపై దాడులు

ముంబయిలో ఎంఎన్ఎస్, శివసేన ఆగడాలు

ముంబయి : రైల్వేలో ఉద్యోగం కోసం బోర్డు నిర్వహిస్తున్న రాత పరీక్షకు హాజరైన పలువురు ఉత్తర భారతీయులపై రాజ్‌థాకరే నాయకత్వంలోని మహారాష్ట్ర నవ నిర్మాణ సేన (ఎంఎన్ఎస్) కార్యకర్తలు దాడులకు దిగారు. సియోన్, థానే, కళ్యాణ్, డోంబ్‌విలీ, వాషీ, భయందర్, నల్లసోప్రా, నెరూల్‌తో పాటు పలు రైల్వే స్టేషన్లు, పరీక్షా కేంద్రాల [illegible] కార్యకర్తలు అభ్యర్థులపై దాడులకు పాల్పడ్డారు. స్థానికులకు తగిన ప్రాధ్యాన్యత ఇవ్వలేదంటూ ఎంఎన్ఎస్, శివసేన కార్యకర్తలు పరీ[illegible]తెగబడ[illegible] తమ జవాబు పత్రాలు చేతపట్టుకొని కన్నీటితో [illegible] వచ్చేశారు. పలుచోట్ల అభ్యర్థులపై ఆందోళనకారులు రాళ్ళు రువ్వారు. [illegible] 12 [illegible] పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో నెరూల్‌కు చెందిన శివసేన కార్పొరేటర్ విజయ్ మానే కూడా ఉన్నారు. ఇదిలా ఉండగా గతంలో కూడా ఇలాంటి సంఘటనే చోటుచేసుకుంది. 2003 నవంబర్‌లో కళ్యాణ్‌లో నిర్వహించిన రైల్వేబోర్డు పరీక్షకు ఇతర రాష్ట్రాల నుంచి, ప్రత్యేకించి ఉత్తరాదికి చెందిన వారు హాజరుకాకుండా చూసే ఉద్దేశంతో థాకరే మద్దతుదార్లు రాత పరీక్షకు ఆటంకాలు కల్గించారు. బిజెపి ఉత్తర భారత విభాగం అధ్యక్షులు మృత్యుంజయ పాండే ఈ దాడులను తీవ్రంగా ఖండించారు. ఇటువంటి సంఘటనలు నివారించేందుకు పోలీసులు, అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోకుండా అల్లరి మూకలకు స్వేచ్ఛనిచ్చారని విమర్శించారు. బిజెపి ఉత్తర భారత విభాగానికి చెందిన కార్యకర్తలు హోం మంత్రి ఆర్ఆర్ పాటిల్ ఇంటి ముందు ప్రదర్శన నిర్వహించి [illegible] చేయాలని, దాడులు నివారించడంలో [illegible] విఫలమైనందుకు మంత్రి రాజీనామాకు డిమాండ్ చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మహారాష్ట్ర [illegible] యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు కళ్యాణ్ రాయ్ కూడా ఈ దాడులను ఖండిస్తూ ఎంఎన్ఎస్ కార్యకర్తలపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి విలాస్‌రావ్ దేశ్‌ముఖ్‌ను కోరారు. దాడులకు పాల్పడుతున్న వారిని నివారించకుండా ప్రోత్సహించే విధంగా పోలీసులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

16×16
హైదరాబాద్, కర్నూల్, వైజాగ్,
విజయవాడ, తిరుపతి

అసోంలో రాష్ట్రపతి

గవుహతి : రాష్ట్రపతి ప్రతిభా దేవీసింగ్ పాటిల్ తన ఐదు రోజుల ఈశాన్య రాష్ట్రాల పర్యటనను ఆదివారంనాడు ప్రారంభించారు. అసోం చేరిన రాష్ట్రపతిని విమానాశ్రయంలో గవర్నరు శివచరణ్ మాథుర్ సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి తరుణ్ గొగోయ్ కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. విమానాశ్రయంలో గౌరవ వందనాన్ని స్వీకరించిన అనంతరం రాష్ట్రపతి నేరుగా రాజ్‌భవన్‌కు చేరుకున్నారు. ఆదివారం సాయంత్రం జరిగిన ఒక కార్యక్రమంలో బాలీవుడ్ నటీమణి షబనా అజ్మీకి, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ప్రధాన సంపాదకులు శేఖర్ గుప్తాకు ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ అవార్డులను రాష్ట్రపతి అందజేసారు. సోమవారం ఈశాన్య భారతానికి నిర్మల్ గ్రామపురస్కారాన్ని బహూకరిస్తారు. అనంతరం తేజ్‌పూర్ వైద్యకళాశాల నూతన భవన సముదాయానికి రాష్ట్రపతి చేతుల మీదుగా శంకుస్థాపన జరగనుంది.

ఆనంద్ శర్మకు అదనపు బాధ్యతలు

న్యూఢిల్లీ : విదేశీ వ్యవహారాల సహాయ మంత్రి ఆనంద్ శర్మ సమాచార, ప్రసార శాఖ మంత్రిగా అదనపు బాధ్యతలు చేపట్టారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రియరంజన్ దాస్‌మున్షీ కోలుకునే వరకూ ఆయన ఈ బాధ్యతలు నిర్వహిస్తారు. ప్రధాని మన్మోహన్ సూచన మేరకు రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారని రాష్ట్రపతి భవన్ శనివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపింది.